




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

సర్పంచులకు, ఎంపిటిసిలకు..
గౌరవ వేతనాల్లేవ్..!

స్థానిక ప్రజా ప్రతినిధులైన సర్పంచులకు, ఎంపిటిసిల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతోంది. రెండేళ్లుగా సర్పంచులకు, ఎంపిటిసిలకు గౌరవ వేతనాలు అందడం లేదు. స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వని ప్రభుత్వం కనీసం గౌరవ వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో ఆవేదన వ్యక్తం అవుతోంది...

- రెండేళ్లుగా ఇదే పరిస్థితి
- స్థానిక ప్రజాప్రతినిధుల పట్ల ప్రభుత్వం వివక్ష
- నిధుల పరిస్థితీ అంతే..!



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులైన సర్పంచులు, ఎంపిటిసిల గౌరవ వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 910 మంది సర్పంచులు, 815 మంది ఎంపిటిసిలు ఉన్నారు. 2020 మార్చిలో సర్పంచులు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ దాదాపు 55 నెలల కాలం గడిచిపోయింది. మరో ఐదు నెలల్లో సర్పంచుల పదవీకాలం ముగియనుంది. 2026 జనవరిలో పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల ఎన్నికల కమీషన్ ప్రభుత్వానికి లేఖ సైతం రాసింది. సర్పంచి, ఎంపిటిసిలకు రెండేళ్లుగా గౌరవ వేతనాలు అందని పరిస్థితి ఉంది. ఒక్కో సర్పంచి, ఎంపిటిసికి దాదాపు రూ.లక్ష వరకూ జీతాల బకాయి ఉంది. సర్పంచులకు, ఎంపిటిసిలకు సకాలంలో గౌరవ వేతనం ఇవ్వకుండా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సి బెళగల్ ఎంపిపి మునెప్ప మా గౌరవ వేతనాల సంగతేమిటి అని ప్రశ్నించారు. సర్పంచి, ఎంపిటిసిలు, జడ్పిటిసిలకు జీతాలు ఇవ్వని ప్రభుత్వం ఎంఎల్ఎలకు మాత్రం ప్రతినెలా మొదటి తేదీనే రూ.లక్షల్లో జీతాలు జమ చేస్తోంది. ఎంఎల్ఎలకు జీతాలు సకాలంలో ఇస్తున్నప్పుడు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎందుకు ఇవ్వరనే ప్రశ్న తలెత్తుతోంది.

పంచాయతీలకు ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల విషయంలోనూ గత ప్రభుత్వంతో పాటు, ఈ ప్రభుత్వం సైతం సకాలంలో విడుదల చేయకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతోంది. సర్పంచుల పదవీకాలం మరో ఐదు నెలల్లో ముగియనుంది. గ్రామాల్లో సిసి రోడ్లతోపాటు చేసిన అనేక పనులకు సంబంధించిన బిల్లులు రాని పరిస్థితి ఉంది. ఒక్కో పంచాయతీ పరిధిలో తక్కువగా లెక్కించినా రూ.15 లక్షల వరకూ బిల్లులు పెండింగ్ ఉన్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఇలాగైతే పనులు ఏవిధంగా చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గ్రామాల అభివృద్ధే దేశాభివృద్ధి అంటూ నినాదాలు ఇవ్వడం తప్ప నిధులు, జీతాల విషయంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోని పరిస్థితి ఉంది.

పథకాలు మాత్రం కట్..!

సర్పంచులకు, ఎంపిటిసిలకు సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలను జమ చేసే విధానం తెచ్చారు. సిఎంఎఫ్ఎస్ ద్వారా జీతాలు ఇస్తున్న కారణంగా సర్పంచి, ఎంపిటిసి, జెడ్పిటిసిలకు రైతుభరోసా, తల్లికి వందనం వంటి పథకాలు సైతం నిలుపుదల చేసినట్లు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు గగ్గోలు పెడుతున్నారు. నెలకు రూ. మూడు వేలు జీతం ఇస్తే ప్రభుత్వ పథకాలు ఆపేస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మాత్రం సరైన సమాధానం రాని పరిస్థితి ఉంది.

పెంచుతామని.. అసలే ఇవ్వలేదు..

- బాలపీరా, ఇ తాండ్రపాడు సర్పంచి, కర్నూలు మండలం.



ప్రభుత్వ నిర్ణయం ప్రకారం నెలకు రూ.3వేలు గౌరవ వేతనం ఇవ్వాలి. చంద్రబాబు వస్తే నెలకు రూ.10వేలు ఇస్తామన్నారు. పెంచే సంగతి పక్కన పెడితే ఇవ్వాల్సిన గౌరవం వేతనం కూడా 16 నెలలుగా ఇవ్వలేదు. ఇప్పటికైనా గౌరవ వేతనాలను పెంచి పెండింగ్ బకాయిలను కూడా ఇవ్వాలి.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

- ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి - కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి వివిధ వైద్య, ఆరోగ్య అంశాలపై మెడికల్ ఆఫీసర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎమ్మిగనూరు లక్ష్మణ్ పేట యుపిహెచ్‌సి, ఆదోని హనుమాన్ నగర్ యుపిహెచ్‌సి, ఆదోని ఇందిరానగర్ యుపిహెచ్‌సి హై రిస్క్ ప్రెగ్నెన్సీలను బాగా గుర్తించారని, మిగిలిన యుపిహెచ్‌సి, పిహెచ్‌సి కేంద్రాలు హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించడంలో కొంచెం వెనుకబడి ఉన్నారని తెలిపారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించకపోతే సకాలంలో సేవలు అందక ప్రసూతి, శిశు మరణాలకు దారి తీసే అవకాశం ఉంటుందన్నారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. హై రిస్క్ ప్రెగ్నెన్సీలను గుర్తించేందుకు అవసరమైతే ఆశా వర్కర్లకు, ఎఎన్ఎంలకు శిక్షణ ఇవ్వాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. గర్భిణులను నమోదు చేయడంలో కోసిగి, పెద్దతుంబళం, నందవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు బాగుందని మెడికల్ ఆఫీసర్లను, ఎఎన్ఎంలను అభినందించారు. ఇదే రీతిలో మిగిలిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కూడా గర్భిణులను రిజిస్టర్ చేయడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. గర్భిణులను మొదటి ట్రైమెస్టర్‌లో రిజిస్టర్ చేయడంలో పుచ్చకాయలమాడ, యుపిహెచ్‌సి ఎర్రబురుజు కేంద్రాలు వెనుకబడి ఉన్నాయని తెలిపారు. గర్భిణులను మొదటి ట్రైమెస్టర్‌లో రిజిస్టర్ చేయడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు ఎక్కువగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోసిగిలాంటి పిహెచ్‌సిలో ప్రసవాలు ఎక్కువగా జరుగుతుంటే, క్రిష్ణగిరి, తుగ్గలి, పోలకల్, మొలగవల్లి, నన్నూరు లాంటి పిహెచ్‌సిలలో నెలకు 2 లేదా 3 ప్రసవాలు జరగడం ఏమిటని మెడికల్ ఆఫీసర్లను ప్రశ్నించారు. వైద్యులు బాగా స్పందించి, కేర్ తీసుకుంటే ప్రసవాల శాతం ఎక్కువగా పెరిగే అవకాశం ఉంటుందని, అలా చేసి, పురోగతి తీసుకొని రావాలని ఆదేశించారు. డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కర్ రాజు, డిసిహెచ్ఎస్ జఫ్రుల్లా, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ పాల్గొన్నారు.

జిడిపి నుంచి చిన్నరాయని తిప్ప
రిజర్వాయర్‌కు నీరు నింపాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం మార్కాపురం సమీపాన ఉన్న చిన్నరాయని తిప్ప రిజర్వాయర్‌కు పూర్తిస్థాయిలో నీటిని నింపాలని, పంట కాలువలు పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సిపిఎం నాయకులు చెన్నరాయని తిప్ప రిజర్వాయర్‌ను సందర్శించి నీటి నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి రిజర్వాయర్‌ను నిర్మించిందని, దానిని రైతులకు పూర్తిగా ఉపయోగంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు.ఆ రిజర్వాయర్ పూర్తిస్థాయిలో నీళ్లు నింపితే 10 గ్రామాలకు సాగునీరు, ఎనిమిది గ్రామాలకు తాగునీటికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ రిజర్వాయర్ ద్వారా క్యాన్సర్ హాస్పిటల్‌కు తాగునీటి కోసం తెచ్చారన్నారు. భూగర్భ జలాలు ఇంకిపోకుండా దాదాపు 300 బోర్లకు నీళ్లు రైతులకు అందిస్తుందన్నారు. ఇంతటి ప్రధానమైన ఈ రిజర్వాయర్‌ను ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌లో ఉన్న కంపను తొలగించి రిజర్వాయర్ విస్తీర్ణాన్ని పెంచి రైతులకు సాగునీరు పంట కాలువలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి ఎ.కృష్ణ, మండల నాయకులు కె.మధు, సుదర్శనం, బస్తిపాడు మద్దిలేటి, మార్కాపురం గౌస్ పాల్గొన్నారు.



చెన్నరాయని తిప్పను పరిశీలిస్తున్న నాయకులు

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



ఈ మధ్యకాలంలో కొందరు మోసపూరిత వ్యక్తులు, బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, తక్కువ వడ్డీకి రుణాలు, క్రెడిట్ కార్డులు ఇస్తామని ప్రజలను మోసం చేస్తున్నారని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ లింక్స్, ఫోన్ కాల్స్ లేదా సందేశాల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని అడుగుతారని చెప్పారు. జిఎస్‌టి చార్జెస్ వంటి పేర్లతో ముందుగా డబ్బు చెల్లించమని ఒత్తిడి చేస్తారన్నారు. డబ్బులు చెల్లించిన తర్వాత లోన్ లేదా క్రెడిట్ కార్డ్ ఇవ్వకుండా మోసాలు చేస్తారన్నారు. అపరిచితులు ఫోన్లో, మెసేజ్ ద్వారా లేదా ఆన్లైన్ ద్వారా లోన్స్ , క్రెడిట్ కార్డ్స్ ఆఫర్స్ ఇస్తే నమ్మవద్దన్నారు. కొన్ని కంపెనీలు ముందుగా ప్రోసెసింగ్ ఫీజు, జి ఎస్ టి సర్వీస్ ఛార్జెస్ పేరుతో డబ్బు అడుగుతుంటే వారిని నిర్భయంగా తిరస్కరించండన్నారు. బ్యాంకు వెబ్‌సైట్ లేదా అప్లికేషన్ ద్వారా మాత్రమే లోన్, క్రెడిట్ కార్డ్ కోసం అప్లై చేయండన్నారు. ఎప్పుడూ మీ వ్యక్తిగత సమాచారాన్ని, ఒటి పి పాస్‌వర్డ్, ఎవరితోనూ పంచుకోకండన్నారు. ఎపికె ఫైల్స్ ఇన్ స్టాల్ చేయొద్దని, అపరిచిత లింక్స్ క్లిక్ చేయొద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసం ఎదుర్కొంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేయాలని కోరారు. www.cybercrime.gov.inలో కూడా ఫిర్యాదు నమోదు చేయొచ్చన్నారు. మీ సమాచారం గోప్యంగా ఉంటుందని, బాధితులు భయపడకుండా పోలీసులను సంప్రదించాలని జిల్లా ప్రజలకు సూచించారు.

జ్ఞానార్జన చివరి క్షణం వరకు ఉండాలి

- జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

మానవుని జీవితంలో జ్ఞానం ఆర్జించడం చివరి క్షణం వరకు ఉండాలని అతిథులు సూచించారు. కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. జెసి నూరుల్ కమర్, ప్రయివేట్ విద్యాలయాల అధినేత డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ చంద్రశేఖరకల్కూర జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో ప్రారంభ ర్యాలీకి జెండా ఊపారు. తెలుగు తల్లి విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ మీటింగ్ హాలులో శారదా ప్రభుత్వ సంగీత విద్యార్థులతో నృత్య ప్రదర్శన చేపట్టారు. అనంతరం జరిగిన సభకు ఎఫ్ఎసి సెక్రటరీ వి.పెద్దక్క అధ్యక్షత వహించారు. జవహర్ లాల్ నెహ్రూ, గ్రంథాలయ ఉద్యమ నాయకులు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్.రంగనాథన్, పాతూరు నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ... గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందుతారన్నారు. తద్వారా ఉన్నత దశకు చేరుకోవడానికి హితోధికంగా ఉంటుందన్నారు. వారోత్సవాల ప్రాధాన్యతను తెలియజేస్తూ అందరూ విద్యాలయాలతో పాటు గ్రంథాలయాలను ఆదరిస్తూ అభివృద్ధి చెందాలన్నారు. లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాష, సీనియర్ అసిస్టెంట్ ఎన్.మగ్బుల్ బాష, పి.రేణుక, పి.నషీమాబీ, ఈశ్వరమ్మ, నాగ భాస్కర్, ఉమా పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి నూరుల్ కమర్

చెరువులు ఆక్రమణకు గురికాకూడదు

- జెసి నూరుల్ కమర్

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని నీటి వనరులు, చెరువులు ఆక్రమణలు చేయకూడదని జెసి నూరుల్ కమర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నీటి వనరులు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి జిల్లాస్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వాటర్ బాడీస్‌లో ఆక్రమణలు ఏమైనా జరిగినతే వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆక్రమణలు ఏమైనా జరుగుతున్నట్లయితే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి, వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆక్రమణలకు సంబంధించి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డిఆర్ఒ సి.వెంకట నారాయణమ్మ, డిపిఒ భాస్కర్, కర్నూలు అర్బన్ తహశీల్దార్ రవి, కర్నూలు రూరల్ తహశీల్దార్ రమేష్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి -సి బెళగల్



రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవని ఎస్. వేణుగోపాల్ రాజు వాహనదారులకు హెచ్చరించారు. శుక్రవారం తనిఖీలు చేపట్టి డ్రైవింగ్ లైసెన్సు, యూనిఫామ్, వెహికల్ ఇన్సూరెన్స్ వగైరా వాటిని పరిశీలన చేశారు. నిబంధన లు అతిక్రమించిన వాహనాలకు జరిమానా విధించి హెల్మెట్ ధరించాలని సూచించారు.



స్మశానానికి మోకాళ్లలోతు నీటిలో శవాన్ని మోసుకుపోతున్న మృతుని బంధువు

స్మశానానికి వెళ్లాలంటే అగచాట్లు

-వృద్ధులు, మహిళలు నానా అవస్థలు-పట్టించుకోని పంచాయతీ అధికారులు

ప్రజాశక్తి- పత్తికొండ/మద్దికేర

మరణించిన వ్యక్తిని పూడ్చాలంటే అగచాట్లు తప్పడం లేదంటూ మద్దికేర మండలం బురుజుల గ్రామ వాసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే మద్దికేర మండలం బురుజుల గ్రామంలోని మారెన్న (85) శుక్రవారం మృతి చెందారు. మారెన్న మృత దేహాన్ని తీసుకొని వెళ్లడానికి కుటుంబ సభ్యులు ,బంధువులు వాగులోనే దిగాల్సిన వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు మహిళలు జారిపడిన సంఘటనలు అనేకంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ అధికారులు పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్మశానానికి వెళ్లే రహదారిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు.

కేన్సర్ ఇన్‌స్టిట్యూల్ అరుదైన ఆపరేషన్లు

వైద్యుల బృందాన్ని అభినందించిన డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లోని సర్జికల్ ఆంకాలజీ విభాగంలో రెండు అరుదైన ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బళ్ళారి పట్టణానికి చెందిన 70 సంవత్సరాల ధర్మరాజుకు రెండు నెలలుగా కడుపునొప్పి, ఉబ్బరం తదితర సమస్యలతో ఆసుపత్రికి వచ్చారు. అతనికి పరీక్షలు చేయగా డియోడినం మూడవ భాగంలో 7 సెంటీమీటర్ల న్యూరో ఎండో క్రైన్ ట్యూమర్ అనే అరుదైన క్యాన్సర్‌ను గుర్తించారు. దీనికి లిమిటెడ్ రిసెప్షన్ ఆఫ్ డియోడినం అనే ఆపరేషన్ను విజయవంతంగా నిర్వహించారు. కర్నూలుకు చెందిన 69 సంవత్సరాల ఎం.రాజశేఖర్ బిపికి నాలుగు రకాల మందులు వాడే వాడు. ఇది ఎందుకు అని పరీక్షించగా, అతనికి కుడి ప్రక్క కిడ్నీ పైన జాయింట్ ఫియోక్రోమోసైటోమా అనే అరుదైన బిపిని పెంచే గడ్డ ఉందని గుర్తించారు. దీనికై ఆపరేషన్ చేసి 12 సెంటీమీటర్ల జాయంట్ ఫియోక్రోమోసైటోమా అనే కనితిని తొలగించారు. దీనిని జాగ్రత్తగా ఆపరేషన్ సమయంలో అతని బిపిని మత్తు డాక్టర్లు నియంత్రించి విజయవంతంగా ఆపరేషన్‌ను నిర్వహించినారు. ఆపరేషన్ తర్వాత ఎటువంటి మందులు అవసరం లేకుండా బిపి కంట్రోల్ అయింది. ఈ అరుదైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించిన సర్జికల్ ఆంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేష్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సందీప్ రెడ్డి అనెస్తీసియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ భారతి, వైద్యుల బృందాన్ని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ అభినందించారు. క్యాన్సర్‌కు సంబంధించిన అన్ని రకాల శస్త్ర చికిత్సలను మన కర్నూలు లోని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ లో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద విజయవంతంగా నిర్వహిస్తున్నారు.



బాధితునితో వైద్యులు, సిబ్బంది

నిత్య చైతన్య దీప్తి గ్రంథాలయం

పజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

నిత్య చైతన్య దీప్తి గ్రంథాలయం అని డాక్టర్ ఎం.ఇందిరా శాంతి పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 58 వ గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి ప్రారంభించారు. గ్రంథాలయోధ్యమానికి కృషిచేసిన గాడిచర్ల హరి సర్వోత్తమరావు, మాడపాటి హనుమంత రావు, అయ్యంకి వెంకటరమణయ్య, వావిలాల గోపాలకృష్ణయ్య, పాతూరి నాగభూషణం, సురవరం ప్రతాపరెడ్డి తదితరుల ప్రముఖుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. వైస్ ప్రిన్సిపల్ జె. హేమంత్ డాక్టర్ ఫక్రున్నీసా బేగం, అధ్యాపకులు డాక్టర్ కె. జి. మల్లికార్జున, జి.శ్రీనివాస్,శశికళ, డాక్టర్ జాఫరున్నిసా తదితరులున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు అబ్బాస్ నగర్ లోని రవీంద్ర పాఠశాలల్లో బాలల దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. రవీంద్ర హైస్కూల్ విభాగానికి రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య రవీంద్ర ప్రైమరీ విభాగానికి అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, వెంకాయపల్లిలోని రవీంద్ర గ్లోబల్ స్కూలుకు వైస్ ఛైర్మన్ జి.వంశీధర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జి. పుల్లయ్య మాట్లాడుతూ నేడు పిల్లల పండుగ జరుపుకోవడానికి కారణమైన నాటి మన భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ తన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాల వల్లే భారతదేశం ఎదుగుతోందన్నారు. పాఠశాలల సమన్వయకర్తలు టి.చంద్రశేఖర్, జి. హేమలత, భార్గవి, సౌమ్య, అపర్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.అనంతరం వివిధ పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

హారిజోన్‌లో బాలల దినోత్సవం : కర్నూలు గణేష్ నగర్ లోని హారిజోన్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. డైరెక్టర్ కె.పావని అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవీంద్ర పాఠశాల కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య , ఛైర్మన్ పి.ప్రదీప్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు దేశభక్తి భావాన్ని పెంపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం నెహ్రూ వేషధారణతో విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకుంది.

రిడ్జ్‌లో బాలల దినోత్సవ వేడుకలు : కర్నూలు నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో పండిత నెహ్రూ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని బాలల దినోత్సవం వేడుకలను శుక్రవారం నిర్వహించారు. పాఠశాల సిఇఒ గోపినాథ్ , కో సిఇఒ సౌమ్య గోపీనాథ్, డీన్ రాజేంద్రన్ , ప్రధానోపాధ్యాయులు రాజ్ కమల్ పాల్గొన్నారు.



నృత్య రూపకం ప్రదర్శిస్తున్న రవీంద్ర విద్యార్థులు

మెడికవర్‌లో బాలలదినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మెడికవర్ హాస్పిటల్ కర్నూలులో బాలలదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆసుపత్రిలోచికిత్స పొందుతున్న చిన్నారులకు శుక్రవారం ప్రత్యేకంగా పలు వినోదాత్మక, సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. కేరమ్స్, డ్రాయింగ్, కలర్ ఫిల్లింగ్, చెస్ వంటి ఆటలు చిన్నారుల ముఖాలపై చిరునవ్వులు పూయించాయి. పిల్లలుఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులకు ప్రత్యేక బహుమతులు అందజేసి వారికి ప్రోత్సాహించారు. చిన్నారులతో కలిసి కట్టింగ్ చేశారు. కన్సల్టెంట్ పీడియాట్రిషియన్లు డాక్టర్ కె. సింధూరా రెడ్డి, వై.గణేష్, డాక్టర్ అనుష , డాక్టర్ మమత , క్లస్టర్ హెడ్ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. పిల్లల ఆరోగ్యంతో పాటు వారి భావోద్వేగ శ్రేయస్సు కూడా అత్యంత ముఖ్యమని వైద్య బృందం పేర్కొంది. కర్నూలు మెడికవర్ హాస్పిటల్, అత్యాధునిక సౌకర్యాలు , నిపుణులైన వైద్యులతో పిల్లల ఆరోగ్య సేవల్లో ముందంజలో ఉంటూ, ప్రతి చిన్నారి ఆరోగ్య ప్రయాణాన్ని మరింత సురక్షితంగా, సంతోషంగా మార్చేందుకు కట్టుబడి ఉందన్నారు.



బాలల దినోత్సవంలో చిన్నారులు, వైద్యులు

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- ఓటర్ల మ్యాపింగ్ పూర్తి చేయాలి -ఎన్నికల ప్రక్రియలో బిఎల్‌ఒల పాత్ర కీలకం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



కర్నూలు నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సమావేశ భవనంలో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ ఆర్ఒ బూత్ ఏజెంట్లు హాజరయ్యారు. ఎస్ఐఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ 2002 , 2025 సంవత్సరాల ఓటర్ల మ్యాపింగ్, రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాల ఎస్ఐఆర్ పనితీరుతో సంబంధించి పలు సూచనలు చేశారు. రిటర్నింగ్ అధికారి విశ్వనాథ్ మాట్లాడుతూ 2002 , 2025 ఓటర్ల ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, తప్పుల్లేకుండా బూత్‌స్థాయి యాప్‌లో బిఎల్ఒలు పూర్తిచేయాలని సూచించారు. ఓటరు కుటుంబ సభ్యుల వివరాల నమోదు (ప్రోజనీ) కూడా బూత్ స్థాయి యాప్‌లో తప్పనిసరిగా చేర్చాలని తెలిపారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో అశ్రద్ధ వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం బిఎల్ఒలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తహశీల్దార్ రవికుమార్, ఉప తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న, బూత్‌స్థాయి పర్యవేక్షకులు బిఎల్ఒలు పాల్గొన్నారు.

ఆర్‌టిసిలో ' స్త్రీ శక్తి 'సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- కార్పొరేషన్




ఆర్‌టిసిలో స్త్రీ శక్తి సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం కర్నూలు 1 , కర్నూలు 2 డిపో కార్మికులు బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు జె.దివాకర్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం అమలులో ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయనందున, ఉన్న బస్సులతోనే సరిపెట్టడంతో ఉద్యోగులపై రెట్టింపు పని భారం పడిందన్నారు. టికెట్లు జారీ చేయడంలో చిన్న పొరపాటు జరిగినా సస్పెండ్ చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగ భద్రత కోసం ఇచ్చిన 01/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలన్నారు. పర్యావరణం పేరుతో విద్యుత్ బస్సులను కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ఆర్టీసీని ప్రైవేటీకరించడాన్ని ఐక్యంగా పోరాడాలని కోరారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా నాయకులు విఎస్.రాయుడు మా ట్లాడుతూ పెన్షన్ సమస్యలను పరిష్కరించా లన్నారు. కార్మికులకు చెల్లిం చాల్సిన బకా యిలను వెంటనే ఇవ్వాలన్నానరు. ఎస్బ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి కెసి శేఖర్ మాట్లాడుతూవిద్యుత్ బస్సుల నిర్వహణ మొత్తాన్ని ఆర్‌టిసికి కేటా యించాలని, కొత్తగా సిబ్బందిని రిక్రూట్ చేసుకుని ప్రమోషన్లు ఇచ్చి ఖాళీలను భర్తీ చేసి కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలన్నారు. 1 డిపో కార్యదర్శి సి.బజారి, కర్నూలు డిపో కార్యదర్శి బి.నాగరాజు జిల్లా నాయకులు ఎస్ఆర్‌కె రెడ్డి , జిల్లా నాయకులు ఎస్. మునెప్ప, ఎస్ఎ సలాం, ఆర్ఎల్ నాయుడు, నాగేంద్ర, హుస్సేన్ పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లోనూ సదుపాయాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్పర్సన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్పర్సన్

నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా వంటి సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని 35వ వార్డు అమరావతిలో రూ.11 లక్షలతో రోడ్డు నిర్మాణానికి కౌన్సిలర్ లలితమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం భూమి పూజ చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ లోకేశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అప్పుల నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే బయటపడి అభివృద్ధి వైపు నడుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి నియోజకవర్గానికి సాధ్యమైనంత ఎక్కువ నిధులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వైసిపి నాయకులు చెప్పే అబద్ధాలను, తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని తెలిపారు. కౌన్సిలర్ లలితమ్మ మాట్లాడుతూ... కౌన్సిలర్‌గా గెలిచిన తర్వాత తాము నిరంతరం ప్రజల్లో ఉంటే ఉనికిని కోల్పోతానని భయంతో ఎర్రిస్వామి అనే వ్యక్తి కుతంత్రాల వల్ల గతంలో వార్డు ప్రజలకు దూరంగా ఉండాల్సి వచ్చిందన్నారు. కౌన్సిలర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడం కొంత ఆలస్యమయిందని, ఇప్పటి నుంచి ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సహాయ, సహకారాలతో అమరావతి నగర్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ నాసిర్ హుసేన్, డిఇ రామమూర్తి, ఎఇ భువన చంద్రారెడ్డి, నాయకులు వెల్దుల మధుసూదన శర్మ, పరశురాం, నూర్‌దహాన్, అశోక్ ఉన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- వ్యకాస జిల్లా కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - ఆస్పరి

జనవరి 9, 10వ తేదీల్లో జరిగే వ్యకాస 13వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని వ్యకాస జిల్లా కార్యదర్శి కె.వి.నారాయణ కోరారు. శుక్రవారం స్థానిక బాలుర వసతిగృహంలో వ్యకాస జిల్లా మహాసభల సన్నాహక సమావేశం వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలు తీవ్ర కరువుతో ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధి అవకాశాలు, పరిశ్రమలు లేక పిల్లాపాపలతో పట్టణాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. వలసల నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వడం తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేయడం పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ముగ్గురూ తోడుదొంగలేనని తెలిపారు. ప్రజలు మేల్కొని ప్రభుత్వాలను నిలదీస్తే తప్ప గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందవని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీరు, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న వేదవతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు పూర్తి చేయించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కరువు నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యకాస నాయకులు లింగన్న, బాలకృష్ణ, నాగన్న, రామాంజనేయులు, శ్రీరాములు, రంగరాజు, ఎస్‌ఎఫ్ఐ మాజీ నాయకులు మల్లేష్, రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, సిఐటియు మండల కార్యదర్శి రామాంజనేయులు, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి రవి, రజక సంఘం మండల కార్యదర్శి ఈరన్న, వ్యవసాయ, రైతుసంఘం నాయకులు రవి, పెద్ద వీరభద్రి, నాగరాజు, వీరన్న, గురు స్వామి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

ప్రకటన

యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా క్లెయింట్ కె.కేశవయ్య స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుడు కర్నూలు కలెక్టర్ కార్యాలయంలోని స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా నందు ట్రెజరీ బ్రాంచ్ నందు 2018వ సంవత్సరము వరకు అకౌంట్ కలదు. అకౌంట్ నెంబర్ 30783065666 తరువాత అకౌంట్ సంబంధించి ఎలాంటి లావా దేవీలు నిర్వకహించలేదు. 2019వ సంవత్సరములో చెక్‌బుక్, పోగొట్టుకొని పోయినది. నా క్లెయింట్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అయినందున కొందరు వ్యక్తులు, దొరికిన చెక్కులను ఫోర్జరీ చేసి,తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారు. ఎవ్వరైనా నా క్లెయింట్ కు సంబంధించిన చెక్కు బుక్ దొరికిన యెడల నా క్లెయింట్ కు గాని, మా న్యాయవాది గారికి ఇవ్వగలరు. అందుకు తగిన పారితోషకము ఇవ్వబడును. దొరికిన చెక్కులతో బ్యాంకు లావాదేవిలను నిర్వహించిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని తెలియజేస్తున్నాము.

ఇట్లు
కె.బలరాముడు
పి. మురళి
యం. లక్ష్మీకాంతమ్మ
న్యాయవాదులు
కర్నూలు జిల్లా
సెల్ 9849722621.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప కోరారు. శుక్రవారం ఆలూరు జ్యోతిబసు భవనంలో మండల అధ్యక్షులు బసవరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ స్వర్ణోత్సవ మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా రంగప్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా మాట్లాడారు. జాతీయోద్యమ స్ఫూర్తి, అమరవీరుల వారసత్వంతో ఎస్ఎఫ్ఐ ఏర్పడిందన్నారు. విద్యార్థి ఉద్యమంలో విద్యార్థుల సమస్యల పరిష్కార వేగుచుక్కగా ఉన్న ఎస్ఎఫ్ఐ 49 మహాసభలను పూర్తి చేసుకుని 50వ మహాసభలకు ఆలూరు పట్టణం సిద్ధమవుతోందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ 15 మందితో ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా ఉమేష్, మండల అధ్యక్షులుగా లక్ష్మీనారాయణ, మండల ఉపాధ్యక్షులుగా బసవరాజు, చంద్ర, హనుమంతు, మండల సహాయ కార్యదర్శులుగా శ్రీరాములు, సురేష్ వర్మ, సుధాకర్, కమిటీ సభ్యులుగా ఉపేంద్ర, యశ్వంత్, ఖాజా, మంజునాథ్, డాకీ నాయక్, మురళీ, మణి ఎన్నికయ్యారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ నాయకులు థామస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

స్త్రీ శక్తి కష్టాలు పట్టవా..? : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

ఆర్‌టిసిలో మరిన్ని బస్సులు కొనుగోలు చేసి స్త్రీ శక్తి పథకం కింద మహిళలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకుల డిమాండ్ చేశారు. శుక్రవారం స్త్రీశక్తి పథకం వల్ల ఇబ్బందులు పరిష్కరించాలని ఆదోని డిపో ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజినల్ ఉపాధ్యక్షులు పివి.ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.అజీమ్ ఖాన్, సిఐటియు నాయకులు తిప్పన్న, డివైఎఫ్ఐ నాయకులు వెంకటేష్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పెట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ఆర్‌టిసికి అనేక ఇబ్బందులు వస్తున్నాయని, అదనపు సిబ్బంది లేకపోవడం, మరిన్ని బస్సులు లేకపోవడంతో డ్రైవర్, కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన జీరో టికెట్లు, పెట్టిన ఖర్చును ఆర్‌టిసికి చెల్లించాలని కోరారు. మహిళలకు స్మార్ట్ కార్డులు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా, సిబ్బందిని నియమించకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వ కుండా కాలయాప న చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు స్టేషన్లను ప్రయివేట్‌కు అప్ప జెప్పడాన్ని వ్యతి రేకించాలని కోరారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన నివాసంలో 11 మంది లబ్ధిదారులకు రూ.4,65,656 విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టిడిపి సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయడం పట్ల పేదల తరపున ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా త్వరగా మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. టిడిపి సీనియర్ నాయకులు బసాపురం రామస్వామి, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రామకృష్ణ, మండల అధ్యక్షులు శివప్ప, మాబాష, సాదుల్లా, శివ, విరుపాక్షి, పీరా, సుబ్బారెడ్డి, షరీఫ్, రియాజ్ ఉన్నారు.

తాగునీటి పైపు లీకేజీకి మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందించిన ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

తాగునీటి పైపు లీకేజీకి అధికారులు మరమ్మతులు చేయిం చారు. 'తాగునీటి పైపుకు లీకేజీని పట్టించుకోరా' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన నేపథ్యంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించారు. నంచర్ల గ్రామం సమీపంలో చిప్పగిరి నుంచి నంచర్ల మీదుగా మద్దికెరకు వెళ్లే ప్రధాన పైపునకు లీకేజీ అయిన దగ్గర ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేసినట్లు ఇన్‌ఛార్జీ ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వెంకటరమణమ్మ తెలిపారు. తాగునీటి సమస్య ఎదురవకుండా స్పందించిన అధికారులకు నంచర్ల గ్రామసుతలు కృతజ్ఞతలు తెలిపారు.


మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్...

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- సిఐటియు నాయకులు రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఒంగోలు పట్టణంలో ఈనెల 15, 16వ తేదీల్లో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 15వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కె.ఇస్మాయిల్, జై నాగరాజు కోరారు. శుక్రవారం కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా మున్సిపల్ కార్మికులు దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారని తెలిపారు. మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు కె.ఖాజా, బి.మునీంద్ర, కె.సల్మాన్, నబీసాబ్, మల్లికార్జున, సిఐటియు మండల కార్యదర్శి బి.రాముడు, మండల ఉపాధ్యక్షులు ఎ.సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిఐటియు నాయకులు రాముడు

ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనం విడుదల

ప్రజాశక్తి - ఆదోని

ఇచ్చిన హామీ మేరకు ఇమామ్, మౌజన్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు గౌరవ వేతనం విడుదల చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలో టిడిపి కార్యాలయంలో మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అల్తాఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఇమామ్‌లు, మౌజన్ల గౌరవ వేతనాల విడుదల సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, రాష్ట్ర మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా షేక్ ముస్తాక్ అహ్మద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడారు. ఇమామ్‌లు, మౌజన్ల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న గౌరవ వేతనాలు మైనారిటీల అభ్యున్నతికి ముఖ్యమైన అడుగని తెలిపారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT CIVIL JUDGE : KURNOOL

E.P. NO. 614/2024 IN A.A.NO. 96/2013

Between: M/S. Shriram City Union Finance Ltd (Presently Known as a Shriram Finance Ltd), Kurnool Represented by its Authorized Signatory, Sri B. Madhu Kumar, S/o. Late. B. Sudhakar Naidu ... DHR/Claimant

- Versus -
M.Nirmala and others

4. M. Meena Reddy, D/o. Late M. Venkateswara Reddy Aged about 25 years, (Legal Representative of J. Dr. No. 3)
5. M. Jyothi Reddy, D/o. Late M. Venkateswara Reddy Aged about 23 years, (Legal Representative of J. Dr. No. 3) ....Respondents 4 & 5
Respondents No. 4 & 5 also the LR's of J. Dr No. 3 All are R/o. 45/24K-15-5A, Ameen Abbas Nagar, Kurnool.

-: అండర్ ఆర్డర్ 21 రూల్ 22, 54 CPC నోటీసు :-

పై అమలు అర్జీలో డిక్రీ హోల్డర్ తనకు రావలసిన అమలు అర్జీ మొత్తం రాబట్టుకోనుటకు గాను, J.Dr.No. 4 & 5 మీ తాలుకు క్రింద కనపరిచిన షెడ్యూల్ దాఖలా ఆస్తిని జప్తి కోరి పై అర్జీ దాఖలు చేసివున్నాడు. అందులో మీకు జప్తి నోటీసులు ఎన్నిమార్లు పంపిన మీరు తీసుకోనందున పై కోర్టువారు పై అర్జీలో మీ హాజరు కోరకై ది. 03-12-2025 వ తేదిన వాయిదా వేసి ఉన్నారు. పై అర్జీ సంబంధించి మీకు ఏమైన అభ్యంతరములు ఉన్న యెడల ది. 03-12-2025 వ తేది ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలను తెలుపుకోనవలేను. లేని యెడల పై కోర్టువారు మీపై పరోక్షముగా తీర్మానించబడును.

SCHEDULE

The House bearing Door No. 45/24K-15/5A containing Ground Floor, 1st Floor and 2nd Floor Situated at Ameen Abbas Nagar of Kurnool Town in Sub-Registration District of Kurnool and Registration District of Kurnool built in Survey No. 391 and Plot No.76 the house building along with its fixtures and electrical fittings is bounded by: **East:** House built in Plot No.77, **West:** House built in Plot No. 75, **North:** 40 Feet wide Road, **South:** Plot No.89, Measurements East to West: 40 Feet's or 12.19 mts, North to South: 64 Feet's or 19.50 Mts. Total Extent is 2560 Sq. Feet's or 284.44 Sq. Yards.


(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు) వాయిదా తేది: 03-12-2025.

S. SHASHAVALI, Advocate, Kurnool. Cell: 9440066118.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, కెడిసిసి జిల్లా బ్యాంకు మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర, టిడిపి మండల మాజీ కన్వీనర్ ఎస్.తిమ్మన్న ముఖ్య అతిథులుగా హాజరయి జవహర్ లాల్ నెహ్రూ, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు పాఠశాలలోని పుస్తకాలతో పాటు గ్రంథాలయాల్లో దొరికే పుస్తకాలను కూడా చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు జ్యోతిమూర్తి, జనసేన మండల కన్వీనర్ అరవింద్, టిడిపి నాయకులు గోవిందు, నాగేంద్ర, రామదాస్, పాఠకులు నర్సిరెడ్డి, మహేష్, హనుమంతు రెడ్డి పాల్గొన్నారు. **కౌతాళంలో** జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి మధులిన మాట్లాడారు. గ్రంథాలయం వారోత్సవాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. **దేవనకొండలో** సర్పంచి బండ్లయ్య స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవాలను ప్రారంభించారు. భారతదేశ తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ... విద్యార్థులు పోటీల్లో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించాలన్నారు. జ్ఞాన సుధా, భారతి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఆదోని** గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు సతీష్, బసవరాజు, నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

ఆస్పరిలో నివాళులర్పిస్తున్న నాయకులు



దేవనకొండలో...


ఆదోనిలో



కౌతాళం

చదువుతోనే పిల్లలకు బంగారు భవిష్యత్తు

- టిడిపి ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి - ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-ఆలూరు

చదువుతో భవిష్యత్తును బంగారుమయం చేసుకోవచ్చని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ఆలూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ బాలల దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో, ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా వైకుంఠం జ్యోతి మాట్లాడారు. నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రేపటి తరాన్ని అన్నివిధాలా శక్తివంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దడం కోసం వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో పిల్లలకు ఇష్టమైన మెనూ ఉండేలా చూస్తున్నామని, పిల్లల పథకాలకు స్ఫూర్తి ప్రదాత డొక్కా సీతమ్మ పేరు పెట్టామని చెప్పారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకుని త్వరలోనే పరిష్కరిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులు వైకుంఠ జ్యోతికి శాలువా వేసి సన్మానించారు. అనంతరం బాగా చదువుతున్న విద్యార్థులకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని మైనార్టీ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్ను, పెన్సిల్ కిట్లను ఉపాధ్యాయులు అనిత ఆధ్వర్యంలో అందజేశారు. ఐద్వా పట్టణ కార్యదర్శి మక్బుల్ భాను పాల్గొన్నారు. **నందవరంలోని** కెజిబివి, సరస్వతి విద్యాపీఠం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లిటిల్ జీనియస్ స్కూల్, ఉషోదయ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వేదిక ప్రదర్శనలు, నృత్యాలు, క్విజ్‌లు, డ్రాయింగ్, స్పీచ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమాజ సేవాభావం పెంపొందించేందుకు, ఆరోగ్యం, భద్రతపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. **కౌతాళంలోని** ప్రతిభ హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మదీనా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా కెనరా బ్యాంకు మేనేజర్ కరుణాకర్, కరస్పాండెంట్ సయ్యద్ బాషా, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్ బాష మాట్లాడుతూ... బాలల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామన్నారు. అనంతరం ఆటలపోటీలు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. సెక్రటరీ మైనుద్దీన్, పర్యవేక్షకులు జయలక్ష్మి, భీమేష్, రాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఈరన్న, రామలక్ష్మి, శిరీష, ముంతాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **ఆస్పరిలోని** నారాయణ ప్రైమ్ స్కూల్‌లో ముఖ్య అతిథిగా సిఐ గంగాధర్ పాల్గొని నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు మిఠాయి పంచిపెట్టారు. ముందుగా సిఐ గంగాధర్‌కు ఉపాధ్యాయులు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. విద్యార్థుల నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల అడ్వయిజర్ పవన కుమార్, ప్రధానోఉపాధ్యాయులు ఖలీల్, ఉపాధ్యాయులు సతీష్ కుమార్, నీలకంఠ, ఈశ్వర్, లావణ్య, అంజినమ్మ, పద్మావతి, అశ్విని, పవిత్ర, త్రివేణి, నరసింహులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కారుమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టిఎల్.నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు అరటి పండ్లు పంపిణీ చేశారు. టిడిపి మండల నాయకులు రవి ప్రకాష్ రెడ్డి, టిడిపి నాయకులు దుర్గయ్య, విద్యా కమిటీ ఛైర్మన్ తిక్కయ్య, రాజేశ్వరి దేవి పాల్గొన్నారు. **చిప్పగిరిలో** విజయ విట్టల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరస్పాండెంట్ కిష్టపాడు యూసుఫ్, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలు, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమోంటోలను అందజేశారు. **ఎమ్మిగనూరు** మండలంలోని మాచుమాన్ దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శాంతి రాజు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. **హోళగుంద** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథులుగా మిక్కిలినేని శ్రీనివాసులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ ద్వారకానాథ్ హాజరయి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మిక్కిలినేని శివప్రసాద్ బాలబాలికల కబడ్డీ జట్లకు కిట్లను అందజేశారు. దుర్గాప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు యూనుస్ బాష పాల్గొన్నారు.


ఆలూరులో బహుమతులు అందజేస్తున్న వైకుంఠం జ్యోతి


ఆస్పరిలో కేక్ కట్ చేస్తున్న సిఐ గంగాధర్



కౌతాళం


ఆదోనిలో పుస్తకాలు, పెన్ను, పెన్సిల్ కిట్లు ఇస్తున్న నాయకులు


ఎమ్మిగనూరులో వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది


నందవరంలో వేడుకలు నిర్వహిస్తున్న సిబ్బంది


హోళగుందలో

మిల్లు మేనేజర్ ఇష్టారాజ్యం..!

- సిసిఐ విధుల నిర్వహణ కూడా...
- తేమ శాతం తక్కువగా చూపించేందుకు మామూళ్లు
- రోజుకు రూ.50 వేల ఆదాయం..?
- మేనేజర్ వ్యవహారంపై రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - మంత్రాలయం


జయరాజు ఎఒ గణేష్ రైతు తిక్కయ్య

మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీయల్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న గుంటూరు శ్రీనివాసులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు రైతులు విమర్శిస్తున్నారు. చేయి తడపనిదే పత్తిలో తేమ శాతం తక్కువగా ఉందని నిర్ధారణ చేయడం లేదని రైతు తిక్కయ్య, సిపిఎం నాయకులు హెచ్.జయరాజు మండిపడ్డారు. శుక్రవారం వారు మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ విధులు కూడా ఆయనే నిర్వహిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అతివృష్టి వల్ల తడిసిపోయిన పత్తి పంటకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండలంలోని శ్రీరాఘవేంద్ర ఆగ్రో ఇండస్ట్రీయల్‌లో అధికారులను సిసిఐలుగా నియమించిందని, ఇక్కడ పనిచేస్తున్న సిసిఐలు సమయపాలన పాటించకుండా మేనేజర్‌తో కుమ్మక్కయి రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చిలకలడోన గ్రామానికి చెందిన రైతు తిక్కయ్య పత్తిని విక్రయించుకోవాలని మిల్లుకు వెళ్లగా సిసిఐ గైర్హాజరు కావడంతో మేనేజరే పత్తి తేమ శాతం ఎక్కువగా ఉందని డబ్బులు డిమాండ్ చేశారని విమర్శించారు. పంట దిగుబడి లేక అప్పుల్లో మునిగిన రైతులకు ఇలాంటి వారి వల్ల నష్టం వాటిల్లుతోందని వాపోయారు. సిసిఐ లేక మేనేజరే విధులు నిర్వహిస్తున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డికి, ఎఒ జీరా గణేష్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. తీరా ఆరా తీయగా తేమ శాతం తక్కువగా చూపించేందుకు పక్కన ఉన్న రైతుల నుంచి రూ.1000 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిసిందని, నిజాయితీగా అడిగినందుకు తనకు 30 వేల నష్టం జరిగిందని వాపోయారు. రోజుకు 50 వాహనాలకు పైగా పత్తి విక్రయాలకు మిల్లుకు వస్తుంటాయని, రోజుకు మేనేజర్‌కు జీతం కాకుండా అదనంగా రూ.50 వేలకు పైగా సంపాదన ఉంటుందని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులయిందని, ఇప్పటికే సుమారు రూ.7.5 లక్షలు వెనుకేసుకున్నారని తెలిపారు. ఈ విషయంపై మిల్లు యాజమాన్యానికి ఫోన్ చేసినా స్పందించలేదని చెప్పారు. మిల్లు యాజమాన్యంతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఒ జీరా గణేష్‌ను వివరణ కోరగా... సిసిఐ విధులు మీరెలా నిర్వహిస్తార'ని పత్తి మిల్లు మేనేజర్‌ను ప్రశ్నించగా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని, జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

మంచాలమ్మకు స్వర్ణ పాదుకలు విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

గ్రామదేవత శ్రీమంచాలమ్మ దేవికి భక్తుల నుంచి స్వర్ణ పాదుకలు విరాళంగా వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక భక్తుడు సోమనాథ్ రూ.లక్ష విలువ చేసే బంగారు పాదుకలను శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులకు అందజేసినట్లు చెప్పారు. పీఠాధిపతులు వారికి శేషవస్త్రం, ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారని చెప్పారు.

IN THE COURT OF THE IVTH ADDL JR. CIVIL JUDGE : KURNOOL
E.P.NO.83/2023 IN O.S.NO.1340/2021

Pinjari salaeem Basha. ...D.Hr
-Vs-
Pinjari Dasthagiri and another. ...J.Dr

C.P.C O-21-R-32 (1), ప్రకారం J.Dr కు నోటీసులు

1) పింజరి దస్తిగిరి తండ్రి పి.మాబుల్
2) పింజరి మాబులు @ మాబుసెహాబ్
తండ్రి లేటు పెద్దయ్య, ఇద్దరు, వెంకటగిరి (గ్రా), కోడుమూరు (మం), కర్నూలు (జిల్లా).

పై నెంబర్ ఇ.పి.లో డి.హెచ్.ఆర్ 30-09-2022 తేదిన మీ పైన పొందిన డిక్రిని అమలు జరుపుటకు మీరు షెడ్యూలు ఆస్థికి వాది హక్కును బంగం కలిగించనారని మీ పైన కోర్టు ఉత్తర్వు దిక్కరము క్రింది మీ పైన అమలు అర్జి దాఖలు చేసినారు. ఇందులో 1,2, జె.డి.ఆర్.లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 15-12-2025 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :- Residenctial house bearing No.1-49 old No.1-29/A, Situated at venkatgiri village, kodumuru Mandal and kurnool dist and bounded
East - Rasta, West - House of Sangala Giddappa
North - House of Kuruva Bandari
Sout - House of Katika Seetha Ramudu.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

ఎస్.వి.కృష్ణారెడ్డి,
డి. హెచ్.ఆర్. పరదం అడ్వకేటు,
కర్నూలు.

IN THE COURT OF THE PRL.JR.CIVIL JUDGE : KURNOOL
E.P.NO.390/2023 IN O.S.NO.701/2021

Masapogu Nagarju. ...D.Hr.
-Vs-
M.Immaneal S/o Danial,
H.No.69/203, Near Maremma gudi,
Madigapeta, Joharapuram (V), Nandyla (M),
Kurnool (Dt). ...J.Dr

J.Dr కు O-21- R-34 ప్రకారం C.P.C లో నోటీసులు

పై నెంబర్ ఇ.పి.లో డి.హెచ్.ఆర్ (వాది) ప్రతివాదిపైన 21-04-2023 తేదిన పొందిన డిక్రిని అమలు జరుపుచు షెడ్యూలు దాఖల అస్థిని రిజిస్ట్రర్ కోరి అములు అర్జి (ఇ.పి) దాఖలు చేసినాడు. ఇందులో జె.డి.ఆర్ అయిన నీకు ఆక్షేపణ ఉన్న 25.11.2025 తేదిన పగలు 10.30 గం.లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడును.

షెడ్యూలు :- The Land Situated at Kurnool division, Kurnool. sub division, kallur panchayathi village, joharapuram, kurnool SRO and kurnool dist, s.y.no.-68/2A1VPYKI, Area 2.18 cents only, joharapuram village, housing its boundaries
East : Land of kasamura golla busanna
West : Land of Chinna kasanna
North : Land of K.Venkataiah
South : Remaning land in same sy no.Land of Laddiagri Nagesham Yesaiah

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

కె.నాగరాజు,
డి. హెచ్.ఆర్. పరదం అడ్వకేటు,
కర్నూలు.